# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 08-04-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఎన్నికల్లో యువత, పట్టణ ఓటర్లను భాగస్వాములను చేసేందుకు భారత ఎన్నికల సంఘం సామాజిక మాధ్యమాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది.**
2. **దేశవ్యాప్తంగా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నుంచి వివిధ అనుమతుల కోసం సువిధ యాప్ ద్వారా 73 వేల 379 దరఖాస్తులు వచ్చాయని ఎన్నికల సంఘం తెలిపింది.**
3. **ఆంధ్రప్రదేశ్‌లో 64 లక్షల 91 వేల మంది లబ్దిదారులకు సామాజిక పింఛన్లు పంపిణీ చేశామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ తెలిపారు.**
4. **ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. వడగాల్పులు వీస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది.**
5. **ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గీతమైన మా తెలుగుతల్లికి మల్లెపూదండ గీతాన్ని రచించిన శంకరంబాడి సుందరాచారి వర్థంతి ఈరోజు.**

==========================

ఎన్నికల్లో యువత, పట్టణ ఓటర్లను భాగస్వాములను చేసేందుకు భారత ఎన్నికల సంఘం అనేక కార్యక్రమాలు చేపడుతోంది. సామాజిక మాధ్యమాల ద్వారా యువత, తొలిసారి ఓటుహక్కు వినియోగించుకుంటున్న వారికి అవగాహన కల్పిస్తోంది. ఇందుకోసం 'టర్నింగ్ 18' కార్యక్రమం ద్వారా ప్రోత్సహిస్తోంది. పోలింగ్ వ్యవస్థతో పాటు ఎన్నికల ప్రక్రియలోని ప్రాముఖ్యతను గుర్తించి ఏ ఒక్క ఓటరూ కూడా వెనకబడకూడదని 'యు అర్ ది వన్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. యువతే లక్ష్యంగా 'జెనరేషన్ జీ' విధానంలో ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని సులభంగా అర్థమయ్యేలా రూపొందిస్తోంది. ఎన్నికల ప్రక్రియపై నకిలీ వార్తలు, అసత్య సమాచారాన్ని అరికట్టడానికి 'వెరిఫై బిఫోర్ యు యాంప్లిఫై' పేరుతో కార్యక్రమాన్ని ప్రారంభించింది.

--------------------------

సార్వత్రిక ఎన్నికల ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సువిధ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గా అభ్యర్థులు అన్నిరకాల అనుమతుల కోసం సువిధ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఎన్నికల సంఘం తెలిపింది. దేశవ్యాప్తంగా నిన్నటి వరకు సువిధ యాప్ ద్వారా 73 వేల 379 దరఖాస్తులు వచ్చాయని ఎన్నికల సంఘం తెలిపింది. అందులో సుమారు 60

శాతం.. అంటే 44 వేల 626 దరఖాస్తులకు అనుమతి మంజూరు చేశామని వెల్లడించింది. 11 వేల 200 దరఖాస్తులు తిరస్కరించామని, మరో 10 వేల 819 దరఖాస్తులు చెల్లనివిగా గుర్తించామని పేర్కొంది. మరో 6 వేల 734 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని తెలిపింది. తమకు అందిన దరఖాస్తుల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి వెయ్యీ 153, తెలంగాణ నుంచి 836 దరఖాస్తులు వచ్చాయని కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా 64 లక్షల 91 వేల మంది లబ్దిదారులకు సామాజిక పించన్ల రూపంలో వెయ్యీ 930 కోట్ల 25 లక్షల రూపాయలు పంపిణీ చేశామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ తెలిపారు. శనివారం నాటికి ఈ మొత్తాన్ని పంపిణీ చేశామని మొత్తం పింఛన్లలో ఇది 98.81 శాతమని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో గడిచిన 58 నెలల కాలంలో తమ అధికారాన్ని ప్రజా సంక్షేమానికి వినియోగించామని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. మేమంతా సిద్ధం పేరుతో చేపట్టిన బస్సు యాత్రలో భాగంగా నిన్న ఆయన ప్రకాశం జిల్లాలో ప్రచారం నిర్వహించారు. కొనకనమిట్ల మండలం దొనకొండ అడ్డరోడ్డు వద్ద జరిగిన బహిరంగ సభలో జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. తమ పాలనలో మహిళా సాధికారితకు పెద్దపీట వేశామని.. ఆక్వా రైతులకు రూపాయిన్నరకే విద్యుత్ అందించామని, వందేళ్ల తర్వాత భూముల్ని రీ సర్వే చేయిస్తున్నామని వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి పూర్తయి ఉంటే ప్రభుత్వానికి సమృద్ధిగా ఆదాయం ఉండేదని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు తెలిపారు. కృష్ణాజిల్లా పామర్రు, పెనమలూరులో నిన్న ఆయన ప్రజాగళం బహిరంగ సభల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడం తన జీవితాశయం అని తెలిపారు. రాష్ట్రంలో ఉద్యోగావకాశాలు లేక యువత ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ నిర్వహిస్తామని.. ఉద్యోగం వచ్చే వరకు యువతకు 3 వేల రూపాయల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని చంద్రబాబు నాయుడు భరోసా ఇచ్చారు.

---------------------------

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి ప్రసాదానికి అనకాపల్లి బెల్లం వినియోగించడానికి కృషి చేస్తామని జనసేన పార్టీ అధ్యక్షులు కె.పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. వారాహి విజయభేరి యాత్రలో భాగంగా ఆయన నిన్న ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి జిల్లాలో పర్యటించారు. తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా అనకాపల్లిలో నిర్వహించిన రోడ్ షోలో ఆయన మాట్లాడుతూ... శారదా నదిపై మినీ ప్రాజెక్టులు, కాల్వలకు మరమ్మతులు చేసి ప్రతి పొలానికి నీళ్లు ఇస్తామని తెలిపారు. తమ కూటమి అధికారంలోకి రాగానే ఉద్యోగుల కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకంలో నెలకొన్న సమస్యకు పరిష్కారం చూపిస్తామని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గీతమైన మా తెలుగుతల్లికి మల్లెపూదండ గీతాన్ని రచించిన శంకరంబాడి

సుందరాచారి వర్ధంతి ఈరోజు. 1914 ఆగస్ట్ 10వ తేదీన ఆయన తిరుపతిలో జన్మించారు. ఆయన రచించిన పద్యాలు ఎక్కువ భాగం తేటగీతి ఛందస్సులోనే ఉంటాయి. మా తెలుగుతల్లికి మల్లెపూదండ గీతంలో రాష్ట్ర చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని నాలుగు పద్యాలలో శంకరంబాడి సుందరాచారి రచించారు. ప్రఖ్యాత గాయకురాలు టంగుటూరి సూర్యకుమారి గ్రామఫోన్ రికార్డు కోసం ఆ పాటను మధురంగా పాడిన తరువాత ఆ గీతానికి గుర్తింపు లభించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆ గీతాన్ని రాష్ట్ర గీతంగా గుర్తించి గౌరవించింది. 1977 ఏప్రిల్ 8వ తేదీన సుందరాచారి తిరుపతిలో కన్నుమూశారు. 2004లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, తిరుపతి–తిరుచానూరు రోడ్డులోని అన్నపూర్ణేశ్వరి సర్కిల్‌లో సుందరాచారి జ్ఞాపకార్థం, ఆయన కాంస్య విగ్రహాన్ని నెలకొల్పి గౌరవించింది.

---------------------------

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పెరుగుతున్న ఎండలతో పాటు వడగాడ్పులు వీయడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిన్న ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కలిగిరిలో 45.8, వైఎస్ఆర్ జిల్లా ఖాజీపేట, సింహాద్రిపురంలో 45.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. శ్రీకాకుళం నుంచి పల్నాడు జిల్లా వరకు 93 మండలాల్లో ఈ రోజు వడగాల్పులు వీస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. చింతూరు, కూనవరం మండలాల్లో తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ఒడిశా నుంచి ఛత్తీస్‌గఢ్, విదర్భ, కర్ణాటక మీదుగా తమిళనాడు వరకు ద్రోణి విస్తరించింది. దీని ప్రభావంతో ఈ రోజు కోస్తా ప్రాంతంలో చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. అటు.. తెలంగాణాలో సూర్యాపేట జిల్లా శాంతినగర్‌లో 44.5 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. 28 జిల్లాల్లో 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదయ్యింది.

---------------------------

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి గ్యారంటీ హామీలు అమలు చేస్తున్న విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పార్టీ నాయకులకు సూచించారు. నిన్న ఆయన హైదరాబాద్‌లోని తన నివాసంలో సికింద్రాబాద్, వరంగల్ లోక్‌సభ నియోజకవర్గాల నాయకులు, మంత్రులు, శాసనసభ్యులతో సమీక్షలు జరిపారు. ఈ సందర్భంగా లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత మిగిలిన హామీల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ప్రజలకు వివరించాలని వారికి దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ జాతీయ మ్యానిఫెస్టోలో ఇచ్చిన గ్యారంటీ హామీలపైనా ఇంటింటికీ విస్తృత ప్రచారం చేయాలని రేవంత్ రెడ్డి పార్టీ శ్రేణులకు సూచించారు.

---------------------------

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్ రెడ్డికి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేశ్ కుమార్‌మీనా నిన్న నోటీసులు జారీ చేశారు. జగన్మోహన్ రెడ్డి తన ప్రసంగాల్లో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని అందిన ఫిర్యాదుపై స్పందించిన ఎన్నికల ప్రధానాధికారి.. 48 గంటల్లో వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేశారు.

=====================